# 25 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం ఎక్కడికి పోవాలి



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:**

25 ఏళ్లుగా గ్రామంలో నివాసం ఉంటున్నాం.. మమ్మల్ని పొమ్మంటే ఎక్కడికి పోవాలని గుడిహత్నూర్ మండలంలోని ధామన్ గూడ గ్రామపంచాయతీ పరిధిలోని అనంతపూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారులు తమ గోడు విని, తమకు ప్రత్యామ్నాయం కల్పించాలని కోరారు. ఇదిలా ఉండగా, అటవీ శాఖ అధికారులు ఈ ప్రాంతం అటవీ శాఖ అధీనంలో ఉందని, నాలుగు నెలల లోపు ఖాళీ చేయాలని చెప్పడం తమ కుటుంబాలకు ఆందోళన గురిచేస్తుందని వాపోయారు. ఉన్నట్టుండి ముప్పై కుటుంబాలు ఎక్కడికి వెళ్లి బతకాలని, తాము రోడ్డున పడతామని కనిపించిన నాయకునికల్లా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రామాయి–పార్డి(కె) మార్గంలో బ్రిడ్జి ఎప్పుడు..?

**ఉద్యమ కెరటం, సాత్నాల:**



మండలంలోని రామాయి నుంచి పార్డి(కె) గ్రామానికి వెళ్లే మార్గంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మార్గంలో వాగు ఉండటంతో వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి మంత్రి జోగు రామన్న బ్రిడ్జి నిర్మాణానికి శిలాఫలకం ఏర్పాటు చేసినప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదని గ్రామస్తులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేగా గెలిచిన పాయల శంకర్ కూడా ఎన్నికల తర్వాత ఆరు నెలల్లో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వర్షాకాలంలో వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు చేయడం కష్టంగా మారుతోందని చెప్పారు. ముఖ్యంగా గర్భిణీలు, విద్యార్థులు, అత్యవసర పరిస్థితుల్లో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోయారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి గ్రామస్తుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు



**ఉద్యమ కెరటం, తిర్యాణి:**

మండలంలోని ఖైరిగూడ గ్రామంలో పశువులకు శుక్రవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆవులు, గేదెలకు కలిపి మొత్తం 272 పశువులకు టీకాలు వేశారు. అనంతరం మండల పశు వైద్యాధికారి ఎస్.సాగర్ మాట్లాడుతూ పశువుల్లో ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే సమీప పశువైద్యశాలను సంప్రదించాలని సూచించారు. పశువుల ఆరోగ్యం రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైరిగూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ హెరేకుమ్ర రేణుక, ఉప సర్పంచ్ సెడ్మాకి మోహన్, మండల పశు, సిబ్బంది సురేష్, మనోహర్, రాకేష్, సంతోష్. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- రెండున్నరేళ్లలో బీరోలు అభివృద్ధికి రూ.29.92 కోట్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ఉద్యమ కెరటం, ఖమ్మం:**



ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు, రాకాసి తండా, బంధంపల్లి గ్రామాల్లో జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అకేరు వరద ప్రభావిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. బీరోలు గ్రామంలోని శ్రీరామ లింగేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దమ్మా యిగూడెంలో నూత నంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు నిర్వ హించిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్క రించుకుని మసీదు కమిటీలకు ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా అందజేశారు. ముఖ్య మంత్రి నాయ కత్వంలో ప్రజా ప్రభుత్వం పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని మంత్రి తెలిపారు. గడిచిన రెండున్నరేళ్లలోనే బీరోలు గ్రామ అభివృద్ధికి రూ.29.92 కోట్ల నిధులు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా రూ.2.59 కోట్లతో బీరోలు–ఏలువారిగూడెం రోడ్డు, రూ.64 లక్షలతో ఎస్సీ కాలనీలో అంతర్గత రోడ్లు, రూ.5.50 కోట్లతో ఐనవోలు బ్రిడ్జి, రూ.6.50 కోట్లతో తెడ్డెలపాడు–బీరోలు తారురోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అలాగే రూ.4.05 కోట్లతో బందంపల్లి–హుస్నాబాద్ తారురోడ్డు, రూ.1.87 కోట్లతో బీరోలు–మేడేపల్లి తారురోడ్డు నిర్మాణాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. అదేవిధంగా రూ.3.20 కోట్లతో చౌటుపల్లి–బీరోలు స్లాబ్ కల్వర్ట్, రూ.2 కోట్లతో కూసుమంచి–బీరోలు కల్వర్ట్ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. గ్రామంలో రూ.80 లక్షలతో సీసీ రోడ్లు, రూ.15.50 లక్షలతో అంగన్వాడీ భవనం పనులు ప్రారంభించామని చెప్పారు. బీరోలు పెద్ద చెరువు మరమ్మతులకు రూ.2.05 కోట్లు కేటాయించామని వివరించారు. రాకాసి తండా వరద బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు, స్థలాలు కేటాయించి వేగంగా పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్ర మాన్ని చేపట్టిం దని, పరిపాలనను ప్రజల వద్దకే తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వంపై చూపు తున్న ఆదరణ భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టేందుకు ప్రేరణ నిస్తుందని వివరించారు.

# ఉన్నత చదువే లక్ష్యంగా జన భవిత చారిటబుల్ ట్రస్ట్

- పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

**ఉద్యమ కెరటం, చింతలమానేపల్లి:**



మండలంలోని బాబాసాగర్ పీఎం శ్రీ హైస్కూల్లో జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ట్రస్ట్ ఫౌండర్ చంద్రశేఖర్ జాడే ఆదేశాల మేరకు ట్రస్ట్ అధ్యక్షుడు డి.సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు మాట్లాడుతూ అమెరికాలోని మాట ఆర్గనైజేషన్ సహకారంతో జన భవిత చారిటబుల్ ట్రస్ట్ విద్య, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు, ఉచిత పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్లు, యోగా ధ్యాన తరగతులు, విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలను నిర్భయంగా, ప్రశాంతంగా రాసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని కష్టపడి చదివి పాఠశాలకు, ఉపా ధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఉన్నత చదువుల కోసం జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఎంఈఓ పాసాల జయరాజ్ మాట్లాడుతూ పరీక్షలను ఎలా రాయాలో విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించాలని విద్యార్థులను ప్రోత్సహిస్తూ, అలా సాధిం చిన వారికి ప్రత్యేక బహుమతి అందజేస్తానని ప్రకటించారు. పాఠశాల హెడ్మాస్టర్ సత్యనారాయణ విద్యార్థులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపా ధ్యాయులు, యోగ మాస్టర్ విజయ్ కుమార్, యోగ గురు వినోద్ కుమార్, యోగసాధకుడు కుమారస్వామి తదిత రులు పాల్గొన్నారు..

# రుద్రాక్షపల్లిలో ఉచిత హెల్త్ మెగా క్యాంప్

- క్యాంప్ ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:**



సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉచిత హెల్త్ మెగా క్యాంప్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శాఖ సహకారంతో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఈ హెల్త్ మెగా క్యాంప్ను శుక్రవారం ప్రారంభించారు. ఈ హెల్త్ క్యాంప్లో బాసారం, కొమ్ముగూడెం, తోగ్గుడెం, సత్యంపేట, రంగాపురం, రుద్రాక్షపల్లి గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎమ్మెల్యే స్వయంగా రోగులను పరీక్షించి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం సందర్భంగా మహిళలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమంలో కూడా స్వయంగా పాల్గొన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాయం నాగేంద్ర బాబు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, ఎంఆర్ఓ, ఎండీవో, ఎంపీడీఓ, గంగారాం, పీహెచ్సీ డాక్టర్లు, ఆర్డబ్ల్యూఎస్ డీఈ, సీడీపీఓ, సూపర్వైజర్లు, సెక్రటరీ, స్పెషల్ ఆఫీసర్, ఎస్సై, సత్తుపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ సుమలత, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, ఉప సర్పంచ్ భూపతి రెడ్డి, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, వార్డ్ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, లైన్ మెన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**ఉద్యమ కెరటం, తాండూర్:**



ఈనెల 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు తాండూర్ మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మండల విద్యాధికారి దుర్గం శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాటిలో తాండూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, విద్యా భారతి ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలుగా ఉంటాయని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలకు తాండూర్ మండలం నుంచి మొత్తం 418 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. వీరిలో బాలురు 226 మంది, బాలికలు 192 మంది ఉన్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 178 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 123 మంది, రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి 116 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. వీరిలో ఒక వికలాంగ విద్యార్థి కూడా ఉన్నట్లు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యా భారతి హై స్కూల్లో సీఎస్గా ఎస్.వేణుగోపాలరావు, డివోగా జీవన్ సెల్వరాణి, తాండూర్ జెడ్పీహెచ్ఎస్లో సీఎస్గా జే.దామోదర్, డివోగా నరేందర్ రెడ్డి వ్యవహరిస్తారని అన్నారు. అలాగే రెండు పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే ఇన్విజిలేటర్లకు సంబంధిత సీఎస్లు, డివోలు సమావేశాలు నిర్వహించి పరీక్షల సమయంలో పాటించాల్సిన విధి విధానాలపై సూచనలు ఇచ్చినట్లు వివరించారు.



## సమస్య వినగానే స్పందన

### ప్రజల నీటి కష్టాలు తీర్చిన కౌన్సిలర్ కార్తీక్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** జిల్లా కేంద్రంలోని 11వ వార్డు సందీప్ నగర్ కాలనీవాసుల ఏడాది కాలపు తాగునీటి కష్టాలకు తెరపడింది. గత కొంతకాలంగా వేధిస్తున్న నీటి సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సందీప్ నగర్‌లో నీటి సరఫరా చేసే మోటారు గత ఏడాది కాలంగా మరమ్మతుకు గురై నిలిచిపోవడంతో, కాలనీలో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీనివల్ల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను కాలనీవాసులు వార్డు కౌన్సిలర్ కార్తీక్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించారు. సమస్య తీవ్రతను గుర్తించిన కౌన్సిలర్ కార్తీక్ స్వయంగా పర్యవేక్షించి, మోటారుకు మరమ్మతులు చేయించారు. మరమ్మతుల అనంతరం నీటి సరఫరా పునరుద్ధరించబడటంతో చాలా కాలంగా ఉన్న నీటి కష్టాలు తీరినట్లయింది. తమ ఇబ్బందులను అర్థం చేసుకుని తక్షణమే పరిష్కరించినందుకు కాలనీవాసులు కౌన్సిలర్ కార్తీక్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## గురుకుల విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి వార్షిక పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమైన రైటింగ్ ప్యాడ్స్, పెన్నులను అందించి, వారు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంతమైన చిత్తంతో పరీక్షలు రాసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. పేరెంట్స్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ముంజం అశోక్ గారు మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమం కోసం కమిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చాలుర్కర్ వామన్, దొంగ్రీ శ్యామరావు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనపై శిక్షణ



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై జిల్లా సమీకృత కార్యాలయంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు శుక్రవారం జిల్లాస్థాయి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అనిత కొత్తపల్లి, కౌన్సిలర్లు మహమ్మద్ అఫ్జల్ బేగం, అలియా బేగం, ఎమ్మాజీ శారద, మిట్టపల్లి కమల, గజ్జల లావణ్య, బసవ తస్కిన్ మస్తాన్ బేగ్, అల్లాడి దుర్గమ్మ, కచ్చుకాయల జ్యోతి, కావేటి విజయకుమార్, పఠాన్ తస్కిన్ బేగం, దుర్గం సూరజ్, వసీమున్నీసా, సిద్ధం రాజేశ్వరి మరియు విశ్వేశ్వరరావు ఈర్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కే.హరిత, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీ ప్రజాప్రతినిధులకు ప్రజాపాలన కార్యక్రమ లక్ష్యాలు, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు విధానం, ప్రజలకు మెరుగైన సేవలు గురించి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు బి.తిరుపతి, గజానంద్, ఆసిఫాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, జిల్లా సర్పంచులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని మాదారం గ్రామపంచాయతీలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని సర్పంచ్ కుశ్నపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డిలు కోరారు. శుక్రవారం తాండూర్ నాయబ్ తహశీల్దార్ కల్పనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదారం పంచాయతీ పరిధిలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో స్థానిక ప్రజలతో పాటు విద్యార్థులు ఆధార్ కు సంబంధించిన ప్రతి విషయమై బెల్లంపల్లికి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ అప్డేట్ చాలా మందికి అవసరం ఉన్న దృష్ట్యా రెండు రోజుల పాటు పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచి ప్రజల అవసరాలను తీర్చాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ తహశీల్దార్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు.



# అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలి

### ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం 9వ వార్డులో అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ , కౌన్సిలర్ లతో కలిసి పాల్గొని పారిశుధ్య పనులను పర్యవేక్షించడమే కాకుండా, స్థానిక ప్రజలతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి , ప్రజా ఆరోగ్యమే తమ ప్రథమ ప్రాధాన్యతని పేర్కొన్నారు. కేవలం అధికారుల వల్ల మాత్రమే మార్పు రాదని, ప్రజలు కూడా తమ బాధ్యతగా తడి, పొడి చెత్తను వేరు చేయడం నేర్చుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోనే హోమ్ కంపోస్టింగ్ విధానాన్ని అనుసరిస్తే చెత్త సమస్యను సమర్థవంతంగా పరిష్కరించవచ్చని ఆయన సూచించారు. కుండీలు, కూలర్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని హితవు పలికారు. ప్లాస్టిక్ రహిత ఆసిఫాబాద్ లక్ష్యంలో భాగంగా వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తక్షణమే మానుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వార్డులో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించి వీధులను శుభ్రపరిచారు. దోమల నివారణకు మందు స్ప్రే చేయించడంతో పాటు, మంచినీటి ట్యాంకర్లను శుభ్రం చేసి ప్రజలకు సురక్షితమైన నీరు అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చిలువేరు వెంకన్న, సాలం బిన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ గజనంద్, టి.ఎం.సి, ఆర్.పి. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు ఘన సన్మానం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ దుకాణ సముదాయ వ్యాపారుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ ఎం. ఆకాష్, వైస్ ఛైర్మన్ ఎండీ అహ్మద్ లతో పాటు కౌన్సిలర్లు చిలువరి వెంకన్న, వైరాగాడే గోవింద్, టీ భార్గవి, సాలం బీన్ అహ్మద్, దూడల లక్ష్మి, నాగు బాయ్, జేబా షేక్‌లను వ్యాపారస్తులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు గుండా ప్రమోద్, రావుల వినయ్, షేక్ షాకీర్, షేక్ మహబూబ్, షబ్బీర్, బాలేష్, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొని మున్సిపల్ పాలకవర్గానికి తమ మద్దతును ప్రకటించారు. పట్టణ అభివృద్ధికి, వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులను ఈ సందర్భంగా వారు కొనియాడారు.



# నిరుపేదల సొంతింటి కల సాకారం

### కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తోందని కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎన్జీఓ కాలనీలో లబ్ధిదారులు బాలే రావు రేణుక బాయి – భారత్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటినీ మాజీ డిసిసి అధ్యక్షుడు విశ్వప్రసాద్, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కౌన్సిలర్ అబ్దుల్లా, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్ , పట్టణ అధ్యక్షుడు రప్పు, లబ్ధిదారులతో కలిసి ఆయన రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేయించారు. అనంతరం శ్యామ్ నాయక్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందుతుందని హామీ ఇచ్చారు. త్వరలోనే రెండు, మూడు విడతల్లో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నాయని, పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వైరగడే గోవింద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిఖిల్, ఆసిఫ్, సఫాన్ తదితరులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్‌లు

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని ఉట్ సారంగపల్లి గ్రామ సర్పంచ్ ఎనుక శ్రీహరి, లంబాడీగూడ సర్పంచ్ ధారావత్ కవితలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారితో పాటు పలువురు వార్డు సభ్యులు, గ్రామస్తులు కూడా పార్టీలో చేరగా, వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లాలో గ్యాస్ కొరత లేదు



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** జిల్లాలో గృహ అవసరాల కుఎల్పిజి గ్యాస్ కొరత లేదని వినియోగదారులు ఎటువంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో నిల్వలను అందుబాటులో ఉంచినట్లు, ఎల్పిజి సిలిండర్లు పక్కదారి పట్టకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సరైన విధంగా సిలిండర్లు ఉపయోగించేటట్లు చూడడానికి ప్రత్యేక మానిటరింగ్ కమిటీ నియమించినట్లు తెలిపారు. ప్రజలు ఎవరు కూడా ముందస్తు బుకింగ్ లు అవసరం లేదని, వినియోగదారుల అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నట్లు తెలిపారు. బుకింగ్ లు నిలువలపై రోజువారి సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకుంటామని, అటువంటివి ఎక్కడైనా సంభవిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. దీని కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఇది జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆధ్వర్యంలో కొనసాగుతుందని 8500844365 నెంబర్ ను సంప్రదించాలని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మరాదని తెలిపారు.

